క్లుప్తంగా

స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్‌గా వేణుగోపాల్



కర్నూలు (న్యూటౌన్): స్వచ్ఛ భారత్ మిషన్-2 కర్నూలు మండల కోఆర్డినేటర్‌గా ఎం.వేణుగోపాల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన నియమించారని కర్నూలు ఎంపీడీఓ కేఏ అజాంఖాన్ వెల్లడించారు. 2018లో సాక్షర భారత్‌లో కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తించిన కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన వేణుగోపాల్‌ను నాటి ప్రభుత్వం తొలగించింది. ప్రజా సంకల్పయాత్రలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సాక్షరభారత్ కోఆర్డినేటర్లందరూ కలిసి వారి సమస్యను విన్నవించారు. ఇచ్చిన హామీ ప్రకారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక స్వచ్ఛభారత్ మిషన్-2 (గ్రామీణ్)లో ఉద్యోగ అవకాశం కల్పించారు. బుధవారం కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, ఏఓ భాస్కర్‌నాయుడును కలిసి జాయినింగ్ లెటర్‌ను అందజేశారు.

మందుబాబుల ఆగడాలు



అంగన్‌వాడీ కేంద్రంలో మద్యం సీసాలు పగులగొట్టిన దృశ్యం

పాణ్యం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-7 మందుబాబులకు అడ్డాగా మారింది. పాణ్యం బస్టాండ్ సమీపంలోని పాత చందమామ హోటల్ వెనుక ఉన్న ఈ కేంద్రంలో మందుబాబులు ఇష్టానుసారంగా వీరంగం చేస్తున్నారు. చిన్న పిల్లలు కుర్చుంటారనే జ్ఞానం లేకుండా గదుల్లోనే మద్యం తాగి ఖాళీ బాటిళ్లను పగులగొట్టారు. ఈ కేంద్రానికి కాంపౌండ్‌వాల్ ఉన్నప్పటికీ లోనిక ప్రవేశించి మరుగుదొడ్డి తాళం పగులగొట్టారు. మలమూత్ర విసర్జన చేశారు. గతంలో పాలప్యాకెట్లు, గుడ్లను తీసుకెళ్లారు. కేంద్రంలో గాజుముక్కలు పడిఉండడంతో సిబ్బంది వచ్చి వాటిని శుభ్రం చేశారు. పోలీసు అధికారులు దృష్టి సారించి మందుబాబుల ఆగడాలను నియంత్రించాలని కోరుతున్నారు.

రూ.38లక్షల విలువైన విత్తనాల అమ్మకాల నిలిపివేత



విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌సీ ఏడీఏ వేదమణి, ఏఓలు

కోడుమూరు రూరల్: మండలకేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో బుధవారం డీఆర్‌సీ ఏడీఏ వేదమణి, ఏఓలు రవిప్రకాష్, హేమలత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలకు సంబంధించి కిరణ్ హైబ్రిడ్స్, విశ్వజిత్ ట్రేడర్స్, కిసాన్‌మాల్, రాఘవేంద్ర సీడ్స్ దుకాణాల్లో సరైన రికార్డులు లేకపోవడంతో రూ.38లక్షలు విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు విత్తనాలు, ఎరువులు, మందులకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్లతో పాటు, రికార్డులను కలిగివుండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తనిఖీ చేశారు. గ్రామంలోని విశ్వజిత్ ట్రేడర్స్ విత్తన దుకాణాన్ని తనిఖీ చేయగా సదరు విత్తన నిల్వలకు సంబంధించిన సరైన రికార్డులు, రిజిష్టర్లు లేకపోవడంతో రూ.2,88,490ల విలువ చేసే విత్తన విక్రయాలను నిలుపుదల చేశారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి సహకరించాలి



వ్యాపారులకు సూచనలిస్తున్న ఈఓ అజయ్‌భాస్కర్

కోడుమూరు రూరల్ : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి వ్యాపారులంతా సహకరించాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి కోరారు. బుధవారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న అధ్యక్షతన ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై పట్టణంలోని హోటళ్లు, కిరాణ, కూరగాయలు, పండ్ల దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సర్పంచు భాగ్యరత్న మాట్లాడుతూ వ్యాపారస్తులు ప్లాస్టిక్ అమ్మకాలను నిలిపివేయాలని, వాటి స్థానంలో పర్యావరణానికి హానీ కలిగించని వాటిని ఉపయోగించాలన్నారు. సమావేశంలో ఈఓ అజయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య పాల్గొన్నారు.

● కోవిడ్‌ను జయించి ప్లాస్మా దానం

కల్లూరు: ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు రామ్‌గోపాల్, చిన్నటేకూరు నివాసి. కరోనా సమయంలో మహమ్మారి ప్రభావంతో అందరూ ఇళ్లకే పరిమితమై ఒకరిని ఒకరు కలుసుకుని అవకాశం లేకపోయింది. అయితే వలంటీర్ రామ్‌గోపాల్ తన క్లస్టర్ పరిధిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఇంటింటికీ తిరిగి నిత్యావసర సరుకులు, కరోనాతో ఇబ్బంది పడుతున్న వారికి మందులు అందించాడు. వారి యోగక్షేమాలు తెలుసుకుని వైద్యులకు సూచన ప్రకారం మందులు అందించాడు. ఈ క్రమంలో రామ్‌గోపాల్ కరోనా పాజిటివ్ వచ్చింది. ఎలాంటి భయం లేకుండా కరోనాను దీటుగా ఎదుర్కొని జయించాడు. కరోనా బారిన తీవ్ర అస్వస్థతతో ఉన్న వారు కోలుకునేందుకు ప్లాస్మా ఉపయోగపడుతుందని తెలుసుకుని ప్లాస్మా దానం చేసి స్ఫూర్తిగా నిలిచాడు.



ప్లాస్మా దానం చేస్తున్న వలంటీర్ రామ్‌గోపాల్ (ఫైల్)

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



ఓర్వకల్లు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పురోగతి, లక్ష్యాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాటర్‌షెడ్ పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలకు వెళ్లే రస్తాలను బాగు చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల విన్నపం మేరకు హుసేనాపురం, మీదివేముల, పూడిచెర్ల గ్రామాలలో బోర్లు మంజూరు చేస్తామన్నారు. తిప్పాయపల్లెలో కొత్త వాటర్ ట్యాంక్‌కు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చి సమస్యను పరిష్కరించిన ఏఈ ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. మండలంలో మిగిలిపోయిన గ్రామాలకు రెండు, మూడు నెలల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అమలు చేసిన 'రైతు నేస్తం' బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు, జడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమనికి పెద్దపీట



పుసులూరు గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పుసులూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు ప్రభుత్వం నుంచి అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ప్రజలు డ్రైనేజీ కాలువలు, ఇతర సమస్యలను లేవనెత్తగా వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నిస్వార్థంగా వలంటీర్ల సేవలు

వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తెలియజేస్తూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. వలంటీర్ల సేవలపై ప్రతిపక్ష నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించడంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను ప్రజలు గమనించాలన్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కేశవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, అశోక్ వర్ధన్‌రెడ్డి, మదన్‌గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను కించపరచడం తగదు

● పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై కోడుమూరులో వలంటీర్ల నిరసన
● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



పూడిచెర్లలో పోస్టర్లతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

కోడుమూరు రూరల్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లను కించపరుస్తూ, వారిని అవమానించేలా మాట్లాడటంపై బుధవారం కోడుమూరులో వలంటీర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి పాతబస్టాండ్ చేరుకున్నారు. అక్కడ గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఉంచారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ ఆధారాలతో పాటు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు నవీన్‌కుమార్ రెడ్డి, మద్దమ్మ, లక్ష్మి, వెంకటేశ్, ఖాజా మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. పవన్ కల్యాణ్ తమకు బేషరత్ గా క్షమాపణలు చేప్పే వరకు నిరసనలు ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో లాయర్ ప్రభాకర్, వలంటీర్లు మనోజ్, జాన్సన్‌కుమార్, రంగస్వామి, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల నిరసనలు

ఓర్వకల్లు : జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం పూడిచెర్ల సచివాలయం వద్ద గ్రామ నాయకులు మహేశ్వర రెడ్డి, సోమశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు పవన్ డౌన్ డౌన్, వలంటీర్ల వ్యవస్థ వర్ధిల్లాలి లనే నినాదాలతో పోస్టర్లను చేతపట్టి నిరసన ప్రదర్శించారు. పవన్ కళ్యాణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పవన్ కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ఓర్వకల్లు: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పింజరి దస్తగిరి, భార్య ఆలిబి(51) తమకున్న మూడు ఎకరాలతో పాటు ఇతరుల పొలాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకునే వారు. కుటుంబ ఖర్చులకు, పంటల పెట్టుబడికి రూ.60 లక్షల దాకా అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చలేక కొద్ది రోజుల నుంచి ఆలిబి మనస్తాపానికి గురయ్యారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. కుటుంబ సభ్యులు అనుమానంతో అక్కడికి వెళ్లి చూడగా తాడుతో వేపచెట్టుకు ఉరేసుకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఖాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేడు 'గడప గడపకు'

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని సచివాలయం-3 పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి బుధవారం తెలిపారు. ఉదయం 8గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. మధ్యాహ్నం గోరుకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తారన్నారు.

పాఠశాల విలీనం ఆపండి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విలీనాన్ని ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకుల బృందం, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ రంగారెడ్డిని కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. మామిదాలపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను స్టాంటన్‌పురంలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేయడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు స్టాంటన్‌పురం వెళ్లాలంటే రోడ్డు, కేసీ కెనాల్ దాటి వెళ్లాలని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోయారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు అమర్, సాయి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

● ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
● గూడూరులో 'జగనన్న సురక్ష'

గూడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని 323 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నాయకులు సైతం ఏపీ తరహా పాలన అమలు చేయడం ప్రారంభించారని కొనియాడారు. టీడీపీ, జనసేన నాయకులు జగన్‌పాలన చూసి ఓర్వలేక కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. వలంటీర్లు ప్రజలకు సేవ చేస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నారని, అటువంటి నిస్వార్థ సేవకులపై బురద జల్లడం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్లపై అనుచిత వాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ వెంటనే వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జే.ఆబేలు, సచివాలయాల కన్వీనర్లు చనుగొండ్ల మహేశంవరెడ్డి, ఎల్.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఒక్కరోజులోనే సర్టిఫికెట్ ఇచ్చారు



కుల, ఆదాయ సర్టిఫికెట్ కోసం గతంలో మీ సేవ, వీఆర్వో, తహసీల్దార్ ఇలా ఎంతో మంది చుట్టూ తిరిగినా ఇవ్వ లేదు. ఇప్పుడు ఒక్క రోజులోనే ఇంటి దగ్గరకే వలంటీర్, అధికారులు వచ్చి సర్టిఫికెట్ ఇచ్చారు. చాలా ఆశ్చర్యంవేసింది. జగన్ మోహన్ రెడ్డికే మళ్లీ నా ఓటు వేస్తా.

–కురుకుంద రామేశ్వరమ్మ'

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పులకుర్తిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే ఎంపీడీఓ చంద్రశేఖర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, డీటీ రామాంజినేయులు, ఏపీఓ రమాదేవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, ఎంపీటీసీ నాగరాజు, స్థానిక నాయకులు సత్యారెడ్డి, లక్ష్మన్న, నాగేంద్ర, సుంకన్న, గిరి, అయ్యన్న, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కరోనా నియంత్రణలో సఫలం

ప్రజలకు ఎలాంటి సమస్యలైన ముందుగా గుర్తుకు వచ్చేది వలంటీర్లే. మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయంలో - 1కు చెందిన క్లస్టర్ - 19లో గ్రామంలోని 74 ఇళ్లకు చెందిన 256 మంది విధులను నిర్వర్తిస్తున్న గ్రామ వలంటీర్ తిరుమలేష్. కోవిడ్ తీవ్రంగా ఉన్న రోజులలో ప్రతిరోజు పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటూ, కోవిడ్ నియంత్రణ పట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పించాడు. అదేవిధంగా తన క్లస్టర్ పరిధిలో ఆశా వర్కర్ రంగమ్మతో కలిసి ఫీవర్ సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే మందులను, మాస్కులను వారి ఇళ్లకే అందజేసి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేశాడు. తన క్లస్టర్‌లో ఒక్కరు కూడా కరోనా బారిన పడకుండా జాగ్రత్తలను తెలియజేశాడు.

– సి.బెళగల్



కోవిడ్ తీవ్రంగా ఉన్న సమయంలో ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్ తిరుమలేష్

కష్టకాలంలో అండగా నిలిచాడు



కరోనా సోకుతుందని మనిషికి మనిషి దూరమైన సమయంలో మాకు మా వలంటీర్ తిరుమలేష్ అందించిన సేవలు మమ్ములను ఆదుకున్నాయి. ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న మాకు వలంటీర్ పలకరింపు, అతను అందించిన సహకారం ఎప్పటికీ మరచిపోలేము. ఇల్లు గడవలేని పరిస్థితులలో మాకు ప్రభుత్వం తరపున వచ్చే పథకాలను ఇంటి వద్దకే వచ్చి అందించాడు. అన్ని విధాలా సహాయసహకారులు అందించి కరోనా కష్టకాలంలో అండగా నిలిచాడు. – జయమ్మ, సి.బెళగల్

విపత్కర పరిస్థితుల్లో నేనున్నానంటూ..

కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఒకరి ఇంట్లోకి మరోకరిని రానివ్వని, మాట్లాడని పరిస్థితి. అలాంటి పరిస్థితిలోనూ కోడుమూరు సచివాలయం - 3 పరిధిలోని వలంటీర్ నవీన్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌ను లబ్ధిదారుల ఇంటికెళ్లి అందిచాడు. అతని పరిధిలోని పింఛన్ లబ్ధిదారురాలు లక్ష్మిదేవి కుమారులిద్దరు వేర్వేరు ప్రాంతాల్లో చిరు ఉద్యోగాలు చేసుకుంటుండగా, ఆమె ఒక్కరే ఇంటి వద్ద ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ కోడుమూరులో జీవనం సాగిస్తోంది. కరోనా సమయంలో ప్రభుత్వం లాకొడౌన్ విధించడంతో లక్ష్మిదేవికి ఇల్లు గడవక, ఏమి పాలుపోక ఉన్న సమయంలో వలంటరీ వచ్చి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బులు ఇవ్వడంతో ఊరట లభించింది. అంతే కాకుండా ఏమి సాయం కావాలన్న ఫోన్ చేయమని చెప్పి ఆమెకు మనోధైర్యమిచ్చాడు.

– కోడుమూరు రూరల్



కరోనా సమయంలో లబ్ధిదారురాలు లక్ష్మిదేవికి వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నవీన్‌కుమార్ రెడ్డి

వలంటీర్ సేవలు మరువలేనివి



కరోనా సమయంలో లాక్‌డౌన్ వల్ల ఏ పనులు లేక అల్లాడుతున్న సమయంలో మా వలంటీర్ నవీన్‌కుమార్‌రెడ్డి నెలనెలా ఇంటికొచ్చి ప్రభుత్వం ఇచ్చే వితంతువు పింఛన్ డబ్బులను ఇచ్చి ఆదుకున్నాడు. ఏమి అవసరమొచ్చిన తనకు ఫోన్ చేస్తే చాలు అంటూ అభయం ఇచ్చివెళ్లేవాడు. కరోనా సమయంలో వలంటీర్ అందించిన సేవలు మరువలేనివి. – లక్ష్మీదేవి, కోడుమూరు

వలంటీర్‌తోనే సంక్షేమ పథకాలు

ఈ చిత్రంలోని మహిళ పేరు తిరుపాలమ్మ అలియాస్ జ్యోతి, భర్త రంగన్న. వీరిది ఓర్వకల్లు గ్రామం. వీరికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. రంగన్న పొదుపు సంఘాలలో సీఆర్‌పీగా పనిచేస్తుండగా, భార్య జ్యోతి ఓ ప్రైవేటు స్కూల్లోనే పనిచేస్తూ పిల్లలను చదివించుకునేది. రంగన్న కరోనా బారినపడి కోలుకోలేక మృతి చెందాడు. ఈ స్థితిలో వలంటీర్ నాగేష్ ఆమెకు మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించి వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేయించాడు. మరుసటి నెలకే పింఛన్ మంజూరైంది. తర్వాత వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేయించగా ఏటా రూ.18,750 అందుకుంటోంది. పొదుపు సంఘం సభ్యురాలు కావడంతో వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలు అందుతున్నాయి. ఆమె కుమార్తె అమ్మ ఒడి, విద్యాదీవెన పథకాల ద్వారా లబ్ధిపొందుతూ ప్రస్తుతం తిరుపతిలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతోంది. ఇలా వలంటీర్ చేసిన సాయం తోనే ప్రభుత్వ పథకాలు వర్తించినట్లు తిరుపాలమ్మ అభిప్రాయం వ్యక్తం చేసింది.

–ఓర్వకల్లు



తిరుపాలమ్మతో బయోమెట్రిక్ నమోదు చేయిస్తున్న వలంటీర్ నాగేష్

మా కుటుంబం నిలబడింది

వైఎస్సార్‌సీపీ పాలనలో మాకు ఇన్ని సంక్షేమ పథకాలు వర్తించడంలో వలంటీర్ కృషి చాలాఉంది. మాలాంటి వారికి అధికారులుగానీ, రాజకీయ నాయకులుగానీ ఎవ్వరూ పలికేవారు కాదు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతోనే మా కుటుంబం నిలబడింది.

– తిరుపాలమ్మ, లబ్ధిదారురాలు, ఓర్వకల్లు

ప్రజా సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: మండల ప్రజల సమస్యలను గ్రామ సచివాలయాల ద్వారా అక్కడికి అక్కడే పరిష్కారం అయ్యేలా మండల అధికారులు పర్యవేక్షించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. బుధవారం ఎంపీడీఓ రాముడు, డ్వామా ఏపీడీ అల్లిపీరతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, ఆయా శాఖల సచివాలయాల ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులలో కూలీల సంఖ్య పెంచాలని, మండలంలో రోజువారి కూలీల సంఖ్యను జిల్లా ఉన్నతాధికారులు మండలానికి ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పెంచాలని డీడీ, ఏపీడీ అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి పూర్తి చేయాలన్నారు. గ్రామాలలోని జగనన్న కాలనీలలో జరుగుతున్న గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలని, పురోగతి సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హౌసింగ్ అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లను హెచ్చరించారు. హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృద్విరాజ్, టీఏలు తదితరులు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ - 2 అదామ్‌బాషా

సి.బెళగల్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ -2 ఆదమ్‌బాష అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పోలకల్ గ్రామంలో పర్యటించి పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మెయిన్ స్కూల్ హెచ్‌ఎం మునిస్వామి, టీచర్లతో కలిసి గ్రామంలోని డ్రాపౌట్ అయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను తెలియజేసి బడికి పంపాలని కోరారు. అనంతరం పాఠశాలలో నాడు - నేడు రెండవ విడతలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, నిర్మాణాలలో పురోగతి సాధించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో స్పెషల్ స్కూల్‌ను సందర్శించారు. అదేవిధంగా బీసీ కాలనీలో రెగ్యులర్ పాఠశాలలో తరగతి గదులను, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎంలు మునిస్వామి, తిమ్మన్న, రేవుల శ్రీనివాసులు, సీఆర్పీ శ్రీనివాసులు ఉన్నారు.

నేడు సి.బెళగల్‌లో సురక్ష సదస్సులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని రెండు గ్రామ సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు బృందాల మండల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులకు ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని వెల్లడించారు. ఆయన చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.